క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ బట్టు మధు, తదితరులు

నేరేడుచర్ల : ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ సెంటర్ కోఆర్డినేటర్ బట్టు మధు కోరారు. శనివారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీఎంలు, సమభావన సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెంటర్ కోఆర్డినేటర్ ఎల్.నర్సింహారావు, ఎల్లయ్య, రాధిక, సుగుణ, నాన్సీ, మాధవి, రేణుక నాగలక్ష్మి, జ్యోతి తదితరులు ఉన్నారు.

డాక్టర్ వేదాద్రికి శ్రీసాయి ప్రజాసేవ రత్న అవార్డు



పూసపాటి వేదాద్రికి అవార్డు అందజేస్తున్న జయజయసాయి ట్రస్ట్ సభ్యులు

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని వజినేపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ పూసపాటి వేదాద్రికి శ్రీసాయి ప్రజాసేవ రత్న అవార్డు లభించింది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన కార్యక్రమంలో జయజయసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్ట్ ఫౌండర్ పూసపాటి బాలాజీ, మధ్య రమేష్ బాబులు అవార్డును ప్రదానం చేశారు. ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న వేదాద్రి విద్యార్థులను నైతిక విలువలతో కూడిన విద్యనందించడంతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్యం వంటి అంశాలపై వివిధ తెలుగు దిన పత్రికల్లో వ్యాసాలు రాస్తూ యువతలో చైతన్యం కల్పిస్తున్నందుకు గాను ఈ అవార్డు అందజేసినట్లు ఆయన తెలిపారు.

అన్ని రంగాల్లో రాణించాలి



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ చరమందరాజు, ఎస్‌ఐ పరమేష్

మేళ్లచెరువు : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు ఆకాంక్షించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్- 16 బాలికల కబడ్డీ పోటీలను స్థానిక ఎస్‌ఐ పరమేష్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కబడ్డీ నిర్వాహకులు నామా నర్సింహరావు, రామచంద్రయ్య, భసవయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పద్మావతికి వినతి



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కోదాడ నుంచి కొండాపురం రోడ్డు, రామాపురం నుంచి చిలుకూరు రోడ్డు వరకు మరమ్మతులు చేపట్టాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వాజిద్ అలీ

కోదాడరూరల్ : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ వాజిద్‌అలీ అన్నారు. శనివారం పట్టణంలోని బాలాజీనగర్ ఎస్సీ(ఏ) బాలుర, అనంతగిరి రోడ్డులోని ఎస్సీ (బీ) వసతి గృహాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులు వసతి గృహాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించాలని, సమావేశాలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు ప్రభాకర్, సైదులు తదితరులు ఉన్నారు.

పోకిరీల ఆగడాలకు చెక్ !

- నాడు రోడ్లపై పోకిరీలు, బైక్ రేస్‌లు, భారీ శబ్దాలతో వాహనాలు
- అవగాహన, కౌన్సిలింగ్‌లతో ఆరునెలల్లో మార్పు తెచ్చిన పట్టణ పోలీసులు
- కోదాడలో ప్రశాంత వాతావరణం కల్పించడంలో సఫలం
- ట్రాఫిక్ సమస్యను కూడా పరిష్కరించాలని స్థానికుల వేడుకోలు



సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేస్తున్న పట్టణ పోలీసులు (ఫైల్)

కోదాడ : పనిచేయాలనే చిత్తశుద్ధి, చేసే పనిలో నిజాయితీ ఉంటే మంచి ఫలితాలు సాధించవచ్చని నిరూపించారు కోదాడ పట్టణ పోలీసులు. పనిచేసే వారికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చి మంచి ఫలితాలు రాబట్టారు పాలకులు. ఆరు నెలల కాలంలోనే పట్టణంలో వచ్చిన మార్పును చూసి పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల క్రితం పట్టణంలో పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ రోడ్లమీద రయ్.. రయ్‌మంటూ దూసుకుపోయే మోటార్ సైకిళ్లు.. రోడ్లమీదే తిష్టవేసే పోకిరీలు, ఓపెన్‌బార్లుగా మారిన దాబాలు.. తెల్లవార్లు రోడ్లమీద బైక్ రేస్‌లు.. రోడ్లమీదే పుట్టినరోజు వేడుకలు, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు.. ఇలా అదుపు తప్పిన పట్టణంలోని లా అండ్ ఆర్డర్‌ను దండనతో కాకుండా అవగాహనతో అదుపులోకి తెచ్చి ప్రజల మన్ననలు పొందుతున్నారు పట్టణ పోలీసులు.

తల్లిదండ్రులకు కౌన్సిలింగ్‌తో ప్రారంభం..

పట్టణంలో తల్లిదండ్రులు మైనర్లకు బైక్‌లు ఇస్తుండడంతో వారు తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఆరు నెలల క్రితం పట్టణ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ మొదలు పెట్టి మైనర్లను అదుపులోకి తీసుకోవడంతో పాటు తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇవ్వడంతో మైనర్లు బైక్‌లు నడపడం పూర్తిగా మానివేశారు. పెద్ద శబ్దాలనిచ్చే సైలెన్సర్లు అమర్చి భయభ్రాంతులకు గురిచేస్తున్న వారి బైక్‌లను స్వాధీనం చేసుకొని సైలెన్సర్లను తొలగించి రోడ్డురోలర్ సాయంతో ధ్వంసం చేశారు. ముఖ్యకూడళ్లలో బర్త్‌డే పార్టీలు చేసుకుంటూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి అదుపు చేశారు. ఆటోలలో సౌండ్ సిస్టం పెట్టుకున్న అదుపులోకి తీసుకొని నిత్యం కౌన్సిలింగ్ ఇస్తుండడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

బార్లను మరిపించే దాబాలపై ఉక్కుపాదం..

పట్టణంలో పదుల సంఖ్యలో ఉన్న దాబాలు ఓపెన్ బార్లుగా మారాయి. వీటిలో మద్యం సేవించి తరచూ గొడవలకు దిగుతుండడంతో పట్టణ పోలీసులు వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు దాబాల్లోకి మద్యం అనుమతిస్తే దాబా వారిని బాధ్యులను చేసి కేసులు నమోదు చేయడంతో పాటు రాత్రి 11 గంటల తరువాత పూర్తిగా మూసి వేయిస్తుండడంతో గొడవలు సద్దుమణిగాయి.

ట్రాఫిక్ సమస్యను కూడా పరిష్కరిస్తే..

పట్టణంలో ప్రధాన సమస్యలను సమర్థంగా పరిష్కరించిన పోలీసులు ఇక ట్రాఫిక్ సమస్యను కూడా పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ముఖ్య కూడళ్లల్లో ట్రాఫిక్ పోలీసులు ఉంటున్నప్పటికీ వారు కేవలం ఫైన్లు వేయడానికే పరిమితమవుతున్నారనే విమర్శలున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పాఠశాలలు వదిలే సమయంలో బస్టాండ్ సెంటర్, రంగా థియేటర్, అనంతగిరి రోడ్డుతో పాటు బొడ్రాయి బజార్, ఖమ్మం క్రాస్‌రోడ్డుల్లో సమస్య తీవ్రంగా ఉందని దీనిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య కూడా పరిష్కరించాలి



కొద్దిరోజులుగా పట్టణ పోలీసులు తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అల్లరిమూకల ఆగడాలు పోలీసుల చర్యలతో తగ్గిపోయాయి. దండనతో కాకుండా అవగాహనతో పోలీసులు పనిచేయడం అభినందనీయం. ఇదే పద్ధతిలో ట్రాఫిక్ సమస్యను కూడా పరిష్కరించాలి.

– ఈదుల కృష్ణయ్య, న్యాయవాది, కోదాడ

సమష్టి కృషితోనే సాధ్యం



పట్టణంలో ప్రజలకు ఇబ్బంది కలిగించే వారి పట్ల చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇస్తున్నాం. సమస్యలను ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాం. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతోనే ఇదంతా సాధ్యమవుతోంది. శాంతిభద్రతలకు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు.

– కె.శివశంకర్, పట్టణ సీఐ

అధికారులకు పూర్తి స్వేచ్ఛనిచ్చాం



గతంలో పట్టణంలో విచ్చలవిడితనం ఉండేది. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పట్టణంలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. అధికారులకు పూర్తి స్వేచ్ఛనిచ్చి రాజకీయ జోక్యం లేకుండా పని చేయించడంతో పట్టణం ప్రశాంతంగా మారింది. పట్టణాన్ని గంజాయి రహితంగా మార్చడంతో పాటు ఎలాంటి గొడవలకు, అల్లర్లకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణాన్ని కల్పించాం.

– నలమాద పద్మావతిరెడ్డి, ఎమ్మెల్యే కోదాడ

సాగునీటి కోసం రైతుల ఆందోళన



వల్లాపురం వద్ద ఏఈ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న రైతులు

నడిగూడెం : నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న మండలంలోని పాలారం మేజర్ (14బి) కాల్వ చివరి భూములకు నీరందించాలని కోరుతూ త్రిపురవరం గ్రామానికి చెందిన పలువురు రైతులు వల్లాపురం వద్ద గల మేజరు కాల్వ వంతెనపై శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. కాల్వ మొత్తం 14 కిలో మీటర్ల పొడవు ఉంటుందని, సాగు నీరు మాత్రం గత కొద్ది రోజులుగా 9వ కిలో మీటరు వరకు మాత్రమే వస్తుందన్నారు. త్రిపురవరం వరకు చుక్కనీరు కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత వేసవిలో రూ.12 లక్షల వ్యయంతో కాల్వలో పూడిక పనులు చేపట్టినా మొక్కుబడిగానే చేశారని ఆరోపించారు. పూడిక తీస్తే చివరి భూములకు నీరు వస్తుందన్నారు. కాగా ఏఈ శ్రీనివాసరావు రైతుల వద్దకు రాగా ఆయన్ని రైతులు నిలదీశారు. తక్షణమే పూర్తి స్థాయి నీటిని విడుదల చేయాలని, కాల్వకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



ఎస్‌ఐ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న పెట్టి వెండర్స్ యూనియన్ నాయకులు

హుజూర్‌నగర్ : ఫ్రూట్స్, చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని ఎస్‌ఐ మోహన్‌బాబు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో పట్టణ పెట్టి వెండర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని చెప్పారు. ఎవరికైన ఏదైన ఇబ్బంది ఉంటే పోలీస్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య, బ్లాక్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముక్కంటి, పట్టణ అధ్యక్షుడు రామరాజు, జిల్లా నాయకులు చింతలకాయల రాము, యూనియన్ నాయకులు జాన్‌సైదా, నాగేందర్, లింగరాజు, వెంకటేశ్వర్లు, ఉస్మాన్, లలిత, రమణ, నాగమణి పాల్గొన్నారు.

నీమాస్త్రంతో పంటలో పురుగు నివారణ

మునగాల : నీమాస్త్రం ద్రావణంతో పంటలతో పురుగు నివారించవచ్చని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మొలుగూరి గోపయ్య తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న రైతు చైతన్య యాత్రలో భాగంగా శనివారం మండలంలోని కృష్ణానగర్‌లో నీమాస్త్రం తయారీపై రైతులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రస్తుతం తేమతో కూడిన చలి వాతావరణం ఉందని, దీంతో వరి పంటపై కాండం తొలుచు పురుగు, ఆకుచుట్టు పురుగు, దోమ పోటు ఆశించే అవకాశముందన్నారు. మనకు అందుబాటులో ఉన్న వేప ఆకు, ఆవు మూత్రం, ఆవు పేడతో నీమాస్త్రం తయారు చేసుకోవచ్చన్నారు. ఈ ద్రావణం పంటపై 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. ప్రతి రైతు ఎలాంటి రసాయన మందులను ఉపయోగించకుండా అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బేతం రవీందర్‌రెడ్డి, బేతం మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

అక్రమంగా చేపలు పట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

నేరేడుచర్ల : పట్టణ శివారులోని నర్సయ్యగూడెం గ్రామ ఊర చెరువులో అక్రమంగా చేపలు పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేరేడుచర్ల మత్స్య సహకార సంఘం చైర్మన్ పెరబోయిన వీరయ్య కోరారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సయ్యగూడెం చెరువులో శుక్ర, శనివారాల్లో అక్రమంగా చేపలు పట్టిన ఆరుగురిలో ఐదుగురిని పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మూడు రోజుల వ్యవధిలో భార్యభర్తలు మృతి

- డైమండ్ నేత్ర నిధికి మృతుల నేత్రాలు దానం



అరుణ నేత్రాలు సేకరిస్తున్న వైద్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గెల్లి అర్చన, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రవి ఇంట్లో మరో విషాదం చోటుచేసుకుంది. రవి తండ్రి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వ్యాపారవేత్త గెల్లి అప్పారావు బుధవారం మృతి చెందగా శనివారం తల్లి అరుణ గుండెపోటుతో అకస్మికంగా మృతి చెందారు. ఒకే ఇంట్లో మూడు రోజుల వ్యవధిలో ఇరువురు మృతి చెందడంలో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా వారి కుమారుడు గెల్లి రవి.. తల్లి అరుణ నేత్రాలను దానం చేశారు. దీంతో మిర్యాలగూడకు చెందిన డైమండ్ నేత్ర నిధి డాక్టర్ రమేష్ వచ్చి నేత్రాలను సేకరించారు. ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, వాసవిక్లబ్, ఆర్య వైశ్య, ప్రజాసంఘాల నాయకులతో పాటు పలువురు పట్టణ ప్రముఖులు, ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

నేడు లంబాడ నాయకుల సమావేశం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఆదివారం లంబాడ గిరిజన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌నాయక్, నగేష్ రాథోడ్, వెంకటేశ్వర్లు, నాగు, రవి, బిలా, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభాలు మార్చుతున్నందున పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, మనోహర్ హాస్పిటల్ ప్రాంతంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నల్లబండగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో..

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ, ఎంపీఎల్, రిక్విన్ ఫ్యాక్టరీల ఫీడర్‌లలో చెట్లకొమ్మల తొలగింపు, కొత్త లైన్ లాగనున్నందున ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ సైదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాపురం క్రాస్‌రోడ్, రెడ్లకుంట గ్రామాలకు విద్యుత్ కూడా సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

సురవరం సుధాకర్‌రెడ్డి సంతాప సభను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : కోదాడలోని కాశీనాథ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 16వ తేదీన నిర్వహించబోయే సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని అమరారం గ్రామంలో సుధాకర్‌రెడ్డి సంతాప సభ కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. సీపీఐ మండల కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు, నాయకులు పి.సైదిరెడ్డి, శ్యామ్‌సన్, పి.సుందరయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి

నడిగూడెం : మండలంలోని బృందావనపురంలో గల ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఉంటున్న వాటర్ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009లో ప్రభుత్వం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిందని, కానీ కొద్ది సంవత్సరాల నుంచి ప్లాంట్ పని చేయడంలేదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, నాయకులు బొడ్డు వెంకటనరాయణ, ముసుకు వీరస్వామి, నారగాని కనకమ్మ, లక్ష్మి రమణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



గడ్డిపల్లి ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

గరిడేపల్లి : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ అన్నారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలో గల ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాల నివారణపై ఆయన విచిత్ర వేషధారణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

తరాలు మారుతున్నా పెండింగ్‌లోనే కేసులు

- సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్



హుజూర్‌నగర్ : మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్

హుజూర్‌నగర్ : తరాలు మారుతున్నా కొన్ని కేసులు పరిష్కారం కాకపోవడం బాధాకరమని సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఒక స్థిరాస్తి వివాదంలో కేసు దాఖలు చేసిన వ్యక్తి చనిపోయి అతని వారసులు రికార్డులలోకొచ్చి వారు కూడా చనిపోయి వారి వారసులు రికార్డులలోకి వచ్చినా కేసులు పరిష్కారానికి నోచుకోకపోవడం బాధకలిగించే విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. కూరలో ఉప్పు ఎక్కువైందన్న చిన్న కారణంతో ఏర్పడిన వివాదం భార్యాభర్తల విడాకులకు దారి తీయడం దారుణమైన విషయమని చెప్పారు. తద్వారా ఆ కుటుంబం విచ్ఛిన్నం కావడం తన ఉద్యోగ నిర్వహణలో స్వయంగా చూశానని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ.. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరుపక్షాలు విజయం సాధించినట్లు అవుతుందని తెలిపారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీనా మాట్లాడుతూ.. రాజీ అయిన కేసులలో కోర్టుకు చెల్లించిన ఫీజును తిరిగి కక్షిదారులకు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. కాగా, ఈ లోక్ అదాలత్ లో 396 క్రిమినల్ కేసులు, 35 సివిల్ కేసులు రాజీ అయ్యాయి. వివిధ కేసులలో తమ నేరాలను అంగీకరించిన ముద్దాయిలకు న్యాయమూర్తులు మొత్తం రూ 7.94 లక్షల జరిమానాలు విధించారు. బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయి రూ.1.60 లక్షలను కక్షిదారులు ఆయా బ్యాంకులకు జమ చేశారు. రోడ్డు ప్రమాద కేసుల్లో నష్టపోయిన బాధితులకు రూ 33. 34లక్షలు వివిధ బీమా కంపెనీల వారు చెల్లించారు. కార్యక్రమంలో న్యాయవాదులు చనగాని యాదగిరి, కాల్వ శ్రీనివాసరావు, ఉదారి యాదగిరి, జక్కుల వీరయ్య, ధూళిపాల శ్రీనివాసరావు, ఏజీపీ రేణుకా దేవి, రవికుమార్, దీపిక, ప్రదీప్తి, న్యాయశాఖ, పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, లోక్ అదాలత్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



కోదాడరూరల్ : మాట్లాడుతున్న జడ్జి సురేష్

కోదాడరూరల్ : రాజీ పడదగిన కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడారు. రాజీ మార్గమే రాజమార్గమని అన్నారు. ఇరు పక్షాలు లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకొని సమయం, డబ్బు ఆదా చేసుకోవాలన్నారు. కాగా, లోక్ అదాలత్‌లో చెక్ కేసులు 11, బ్యాంకు 19, 5 డీవీసీ కేసులలో రూ.1,51,558 జరిమానా, బీఎస్ఎన్ఎల్ కేసులు 5, సివిల్ 13, క్రిమినల్ రాజీ పడదగినవి 51, నేరం ఒప్పుకున్న కేసులు 41 ద్వారా రూ.1,11,050, ఈ పెట్టి కేసులకు సంబంధించి రూ.5,93,280 జరిమానాలు విధించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య, 1వ, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు ఎండి.ఉమర్, ఎస్‌డి.జాకియా, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు ఉన్నారు.

రైతులకు యూరియా కష్టాలు



నడిగూడెం : నడిగూడెం సహకార సంఘం కార్యాలయం ఎదుట క్యూలైన్‌లో ఉన్న రైతులు

నడిగూడెం : నడిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం యూరియా కోసం వచ్చిన రైతులు ఇబ్బందులకు గురయ్యారు. మొత్తం 444 యూరియా బస్తాలు దిగుమతి కాగా తెల్లవారుజాము నుంచే మండలానికి చెందిన రైతులు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడ్డారు. చెప్పులను క్యూలైన్‌లో పెట్టి నిరీక్షించారు. స్థానిక ఎస్‌ఐ అజయ్ కుమార్, ఏఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, పోలీసు పహారాలో యూరియా పంపిణీ చేశారు. యూరియా అందక అనేకమంది నిరాశతో వెనుదిరిగారు. మండల రైతులకు సరిపడా యూరియా అందించాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

చిలుకూరు, బేతవోలులో..

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంతో పాటు బేతవోలు గ్రామాల్లో శనివారం యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో బారులుదీరారు. ఉదయం 6 గంటలకే పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను క్యూలో పెట్టారు. గంటల తరబడి రైతులు నిరీక్షిస్తే ఒక్కో యూరియా బస్తా చొప్పున లభించింది.

మేళ్లచెరువులో..

మేళ్లచెరువు : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. మేళ్లచెరువు మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణం వద్ద రైతులు యూరియా కోసం శనివారం తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో బారులుదీరారు.

ఒక్కో బస్తా చొప్పున..

మోతె : మండల కేంద్రంలోని మన గ్రోమోర్ కేంద్రం వద్ద శనివారం రైతుకు ఒక్క యూరియా బస్తా చొప్పున 1100 బస్తాల యూరియాను మండల వ్యవసాయ అధికారిని అరుణ పర్యవేక్షణలో అందజేశారు. సర్వారం పీఏసీఎస్ వద్ద సీఈఓ దోసపాటి ఉపేందర్.. పోలీసుల సహకారంతో 220 బస్తాల యూరియా పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు నిరాశతో వెనుగిరిగి వెళ్లారు. రైతులందరికీ సరిపడా యూరియా అందించాలని పలువురు ఆందోళన చేశారు.

గ్రామాల వారీగా యూరియా పంపిణీ

మునగాల : మండలంలోని నాలుగు సొసైటీల పరిధిలో గల గ్రామాల్లోని రైతులకు శనివారం నుంచి గ్రామాల వారీగా యూరియా పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బుంగా రాజు తెలిపారు. ఆకుపాముల సొసైటీకి శనివారం 500 బస్తాల యూరియా దిగుమతి కావడంతో ఆకుపాముల రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. తాడువాయి సొసైటీకి 222 బస్తాల యూరియా దిగుమతి అవ్వగా తాడువాయిలోని రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆదివారం తాడువాయి సొసైటీ పరిధిలోని కలకోవ, జగన్నాథపురం గ్రామాల్లో, ఆకుపాముల సొసైటీ పరిధిలోని ముకుందాపురంలో, కొక్కిరేణి సొసైటీ పరిధిలోని కొక్కిరేణిలో, మునగాల సొసైటీ పరిధిలోని మునగాలలో యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యూరియా కావాల్సిన సొంత మండలానికి చెందిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు తీసుకొని రావాలన్నారు. కాగా, తాడువాయి, ఆకుపాములలో శనివారం వేకువజాము నుంచే రైతులు యూరియా కోసం క్యూకట్టారు.



మోతె : సర్వారంలో..

15 రోజులుగా తిరుగుతున్నా



నాకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేపట్టాను. తొలి దఫాగా యూరియా వేసేందుకు యూరియా కోసం గత 15 రోజులుగా తిరుగుతున్నాను. ఒక్క బస్తా కూడా అందలేదు. పొలానికి యూరియా వేసేందుకు అదును దాటుతుంది. అధికారులు స్పందించి సరిపడా యూరియా సరఫరా చేయాలి.

– మామిడి వీరబాబు, రైతు, నడిగూడెం

రేపు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

నేరేడుచర్ల : ఆసరా పింఛన్లు పెంచాలని ఈ నెల 15వ తేదీన ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్‌కుమార్ కోరారు. శనివారం నేరేడుచర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి యడవల్లి చంద్రయ్య, మచ్చ శ్రీను, పల్లె వెంకటయ్య, సీతయ్య, సాయి, శ్రీను, వెంకన్న, చంద్రయ్య, సత్యం, శాంతమ్మ, చిన్నమాయి తదితరులు ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

మోతె : పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ మోతె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సెప్టెంబర్ 15న ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి బచ్చలకూర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మారపంగు రాంమాంజి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు భైరపంగు విజయ్, మండల ప్రధాన కార్యదర్శి గురిజాల వెంకన్న, బొల్లికొండ వెంకన్న, బొర్ర సునీల్, గుల్ల యల్లయ్య, దైద శ్రవణ్, ములకలపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారులు





పట్టణంలోని బృందావన్ ప్లేస్కూల్‌లో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. – కోదాడ